


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పెళ్ళికూతురి బ్రదర్

**పాపం అతన్ని** చూస్తే నాకు జాలేస్తుంది. ఎవరింట్లో పెళ్ళిళ్ళు అయినా ఆ పెళ్ళికూతురు అన్నా లేక తమ్ముడూ చాలా ప్రముఖ పాత్ర వహిస్తాడు.

"పెళ్ళివారు వస్తున్నారు. స్టేషన్‌కి బయలుదేరు."

"విడిదికి కాఫీ పంపించావా? నువ్వెళ్ళి పెళ్ళికొడుకుని కలసిరా"

"బావమరిది ఏడీ బావగారు కాశీ యాత్రకి అలిగి వెళ్ళిపోతున్నారు. గెడ్డం కింద బెల్లం ముక్క పెట్టి బతిమాలి తీసుకు రావోయ్"

"అన్నయ్యా నా ఫ్రెండ్స్ వచ్చారు. వూరు చూస్తారట ఏర్పాటు చెయ్యరా" అని గోముగా పెళ్ళికూతురు.

"ఒరే నాయనా చలపతి పెదనాన్నకి పట్టింపులెక్కువ ఎదుర్కోలుకి దగ్గరుండి తీసుకురారా"

"ఒరేయ్ తాతగారికి ఆయాసం ఎక్కువైంది ఓసారి డాక్టర్‌కి కబురు పెట్టూ.."

ఇలా పని మీద పని చెప్తూనే వుంటారు కాబోయే బావమరిదికి.

నూనూగు మీసాలు వస్తూ, ఇంకా పెళ్ళి కాకుండా చెల్లెలి పెళ్ళి బాధ్యతలు నెత్తిమీద వేసుకున్న ఆ కుర్రాడికి కళ్ళు ఎర్ర ఓణీ అమ్మాయి చుట్టూ తిరుగుతూ వుంటాయి. ఆ అమ్మాయి చెల్లాయి ఫ్రెండ్ అయితే మనశ్శాంతిగా వుంటాడు. అదే దూరపు బంధువు అని తెలిస్తే గుండె గుబగుబలాడ్తుంది. ఏ చెల్లెలి వరసో కాదు కదా అని.

అవసరం లేకపోయినా కనిపించగానే "కాఫీ తాగుతారా?" అంటాడు.

"గాలి బాగా వేస్తోందా?" అంటాడు.

"అమ్మా నాన్నా బావున్నారా?" అంటాడు.

కొంత చొరవైతే "అమ్మ కొబ్బరి బొండాలు తెమ్మంది వెళ్తున్నా. తోడు వస్తారా?" అంటాడు.

పెళ్ళి కావలసిన కొడుకు మనోభావాలు పట్టించుకోని తల్లితండ్రులు "నువ్వు వంట బ్రాహ్మడ్ని తీసుకు రమ్మంటే ఇక్కడేం చేస్తున్నావురా? శుంఠా.. వెళ్ళు.. వెళ్ళి గమ్మున తీసుకురా" అని ఆ అమ్మాయి ముందే అరిచినా అరుస్తారు.

అసలు చక్రాలు చక్రాలు తిప్పుకుని ఎనభైలలోకి వెళ్తే ప్రేమలు ఇప్పటిలా "హాయ్ వాట్సప్?" "ఈవినింగ్ కాఫీ కప్‌లో కలుద్దామా!"

"నో.. సినీమాక్స్‌లో కలుద్దాం"

"సాటర్‌డే లేట్ నైట్ మా ఫ్రెండ్ జాక్విలిన్ రూంలో పార్టీ" అన్నంత చొరవగా అమ్మాయీ, అబ్బాయీ మొదటి చూపులలోనే మాట్లాడుకోవడం వుండేది కాదు.

ఒకే కాలనీలో వున్న అమ్మాయిని ప్రేమించినా ఓ సంవత్సరం పాటు చూపులూ. ఏ పాలసీసా కోసమో, రేషన్ షాప్ క్యూలోనో చిన్న చిరునవ్వూ, తరువాత ఏ శ్రీరామ నవమి పందిట్లోనో కొద్దిగా పలకరింపూ, చెయ్యి తగిలిస్తూ ఏ ప్రసాదమో పెట్టడం ఆ అమ్మాయి జడలోంచి మల్లెపూవు జారిపడితే జేబులో దాచుకోవడం ఇంటికెళ్ళి తెల్లార్లూ దాన్ని వాసన చూసుకోవడం వుండేది.

ఆడపిల్లలైతే అతను తనని గమనిస్తున్నాడని తెలిసాకా, కావాలని అతని ముందు నుండి జడ వూపుకుంటూ, రోజుకి ఓ పదిసార్లు తిరగడం, కావాలని ఏదో కింద పడేసుకుని ఏరుకోవడం. అతను తన వెనుకే వస్తున్నాడని తెలిస్తే భయం గుండెలు గుబగుబలాడడం. రావడం లేదని తెలిస్తే మొద్దు స్వరూపం అని తిట్టుకోవడం. చూస్తే కోపంగా తల తిప్పుకోవడం, చూడకపోతే, అతనికి కనిపించేట్లు చూసేదాకా తిరగడం.

అతను ఏ పనిమీద అయినా ఇంటికొచ్చి అన్నయ్యతో మాట్లాడ్తుంటే, అటూ ఇటూ చూసి అతని చెప్పుల్లో కాళ్ళు దూర్చి, అతని పాద స్పర్శ అనుభవించడం, కాఫీ ఇస్తుంటే మునివేళ్ళు తగిలి ఒళ్ళు ఝల్లుమనడం ఇవన్నీ ఓ ఏడాదిపాటు.

ఇలా ఏడాదిపాటు గడిస్తే కానీ, ఎదురుగా వెళ్ళి పలకరించి "నీ పేరేవిటీ? నేనంటే ఇష్టమేనా?" అనే ధైర్యం వుండేది కాదు.

రాజీ, శాస్త్రీ ప్రేమించుకుంటున్నారని మొదటగా తెలిసేది, వాళ్ళింట్లో వున్న బుజ్జిగాడికో, పక్కింటి పాపాయికో. ఎందుకంటే రాజీ, పాపాయిని శాస్త్రి దగ్గరకి లెక్కలు చెప్పించుకోడానికి పంపించి, కాసేపటికి తనూ వెళ్ళి మైసూరుపాకం ముక్కలు స్టీలు గిన్నెలో ఇచ్చి "పాపాయికి లెక్కలు వస్తున్నాయా?" అని అడిగేది.

శాస్త్రి ఆమె ఓణీ చివర్ల వేసిన ముడులు, తలలో సన్నజాజులూ చూస్తే రెండు రెళ్ళు ఎంతో మరిచిపోయేవాడు. వెర్రిగా "ఆ..ఆ" అనేవాడు.

అలాగే సరోజ ప్రతి సోమవారం శివాలయానికి వెళ్ళేది భక్తిమూలానే అనుకోకూడదు. అక్కడికి శేఖర్ వస్తాడనీ. ప్రేమికులకి చాలా సేఫ్ ప్లేసులు గుళ్ళు.

గుడి అరుగు మీద కూర్చుని కొబ్బరి చిప్పకొట్టుకుంటూ, వేలికి దెబ్బ తగిలి సరోజ అబ్బా! వూదుకుంటే, శేఖర్ గభాల్న ఆ చెయ్యి అందుకుని, వేలు వూది, రక్తం పడ్తుంటే ఆ వేలు నోట్లో పెట్టుకోవడంలో వారి ఏడాది పాటు చూపుల ప్రేమకి క్లైమాక్స్ వచ్చేది.

అలాగే పెళ్ళిళ్ళలో, వయసులో వున్న అబ్బాయికి వయసులో వున్న అమ్మాయిలు ఎదురైనప్పుడు, వీళ్ళు ఎక్కువ కష్ట పడక్కర్లేదు. ఎట్మాస్ఫియర్ సగం పని చేసుకుపోతుంది.

పెళ్ళికూతురి అన్నకి మా చెడ్డ చిరాకు ఎప్పుడు వస్తుందంటే, ప్రేమిద్దాం అనుకున్న అమ్మాయి ఎదురుగా వున్నప్పుడు తాతయ్య వచ్చి "ఇదిగో ఈ పది రూపాయిలూ పట్టుకెళ్ళి ముక్కుపొడుం తెచ్చిపెట్టు. కానీ చిల్లర కాజెయ్యకు వెధవాయ్" అన్నప్పుడు.

తల్లి వచ్చి "మా వాడికీ వచ్చే సంవత్సరం పెళ్ళి చేసేస్తాం. ఈ ఏడే చేసేద్దాం అనుకున్నాం వీడు బి.కాం తప్పక పోతే" అన్నప్పుడు,

తండ్రి వచ్చి "ఇక్కడే చచ్చావేంరా? వెళ్ళు పేరిందేవి వస్తోంది. నీ కాబోయే పెళ్ళాం" అన్నప్పుడు.

ఆ అమ్మాయి ఇవన్నీ విన్నాకా, అతన్ని చూసి ఎంతో ద్రోహం చేసిన వ్యక్తిని తప్పించుకుపోయినట్లు తప్పించుకుపోతుంది.

బావమరిదికి ఇంకా చిరాకు దొబ్బేదెప్పుడంటే, పేకాడ్తున్న పెళ్ళికొడుకు ఫ్రెండ్స్, ఇతను కనిపించగానే "రెండు కాఫీ తెచ్చిపెట్టవోయ్" అన్నప్పుడు, తనని హోటల్ సర్వర్ అనుకుంటున్నారా? అని మండుతుంది.

వంట పొయ్యి దగ్గరున్న పూర్వ సువాసినీ బామ్మగారు కేకేసి "బాబూ కాస్త గంగాళం అందించిపో. పులుసు ముక్కలు వుడికించాలి" అన్నప్పుడు, తను వంట వాళ్ళ అసిస్టెంట్‌నా అనీ? ఎవరో వరుసకి బాబాయ్ "ఒరే.. నాగదిలో ఫ్యాన్ తిరగడం లేదు. కాస్త

చూసి పో'' అని అర్ధరాత్రి అరిచినప్పుడూ, ఏడువారాల నగల ఆదిలక్ష్మి ''ఒరేయ్ నా జడ బిళ్ళ కనిపించడం లేదు. ఇందాక నువ్వు వచ్చి ఇక్కడ చీకటిగా వుందని బల్బు మార్చావటగా?'' అన్నప్పుడు ''నేను దొంగనా?'' అనీ, తండ్రి ''ఒరేయ్ నాంపల్లిలో దిగమంటే, సికింద్రాబాద్‌లో దిగారుట రంగనాథం మావయ్య వాళ్ళూ, వెళ్ళి తీసుకురా'' అని తెల్లారుఝామున మంచి కల కంటుంటే, అరిచినప్పుడూ. ఛీ..ఛీ ఈ పెళ్ళిలో అందరూ ఎంజాయ్ చేస్తున్నారు నేను తప్ప అని కాళ్ళు బాదుకోవాలి అనిపిస్తుంది.

చీకటి పడ్డాక, అందమైన అమ్మాయి పడుకున్న గదిముందుకెళ్ళి కిటికీలోంచి చూసి, గొంతు సవరించుకుని ''దోమలు కుడ్తాయేమోనని ఓడామస్ తెచ్చానండీ'' అంటాడు.

ఆ అమ్మాయి సిగ్గుపడుతూ లేచి కూర్చుంటుంది. ''తెచ్చావుగా వీపు అందదు. రాసేసిపో'' అంటుంది తాయారమ్మ బామ్మ 70 MM వీపు కిటికీకి అడ్డంగా పెట్టి.

అబ్బాయి ''ఛీ అవతలకిపో. నీ కోసం తేలేదు'' అనలేడు. అంటే తెల్లారగానే అమ్మకి చెప్పి బామ్మ చాకి రేవు పెట్టించేస్తుంది.

అతను ఆవిడ వీపుకి పళ్ళు కొరుక్కుంటూ ఓడామస్ రాస్తుంటే, అమ్మాయి కిలకిలా నవ్వి అటు తిరిగి పడుకుంటుంది.

అందమైన రాత్రి ఏకాంతం మురికికాలవ కాలవలో కలసిపోయాయి అని తిట్టుకుంటూ అక్కడి నుండి వచ్చేస్తుంటే, పెద్దమ్మ కూతురు ''ఒరేయ్ పండూగాడిని ఔటుకి తీసుకెళ్ళరా'' అని పురమాయిస్తుంది. తప్పదు అన్నట్లు వాడ్ని ఎత్తుకుని తీసుకెళ్తుంటే కదలికకి వాడు నిద్రలోనే ఆ పని కాస్తా ఇతని షర్ట్ మీద చేసేస్తాడు.

''అమ్మాయి చూడలేదు కదా!'' అని అతను అటూ ఇటూ చూసి, పండూ గాడిచేత మొత్తం పోయించి, అక్క పక్కలో పడుకో పెట్టి, తన గదికి పరిగెడ్తాడు.

ఇంక మగ పెళ్ళివారింట్లో ప్రతివారికీ అలుసే బావమరిదిని చూస్తే.

''బాబూ సెల్‌కి చార్జర్ మరిచిపోయా. కాస్త తెచ్చి పెట్టు. నోకియా''

''ఏవయ్యో నువ్వేనా పెళ్ళికూతురి అన్నా? ఉప్మాలు చల్లారిపోయాయి. మళ్ళీ కాస్త వేడిగా పంపించండి. మా అక్కాయ్ అంటే పెళ్ళికొడుకు తల్లి, ఉప్మా తినదు. ఇడ్లీలు వేసి పంపించండి.''

''ఇదిగో ఇటండి. ఈ గదిలో బుట్టలూ, అట్టపెట్టెలూ అడ్డం తియ్యండి. మా పెట్టెలు పెట్టుకోవాలి''

''ఎవరయ్యా ఆ సన్నాయివాళ్ళు? నగుమోమూ కనలేనీ. వాయించమంటే ఎన్ని అపశృతులో. సరిగ్గా వాయించమను''

''ఏవిటయ్యా ఈ ఏర్పాట్లూ? నా కమోడ్ ఫ్లష్ అవడం లేదు. వచ్చి కాస్త చూడు''

ఇలా వుంటాయి కంప్లైంట్స్.

ఈలోగా అతని ప్రాణం మీదకి ''ఒరే మీ చెల్లెలి ఫ్రెండ్స్ వచ్చారుటగా హైదరాబాద్ నుండి కలర్స్ చూద్దాం అని వచ్చాం'' అని ఫ్రెండ్స్ వస్తారు.

బావమరిదికి వచ్చిన ఫ్రెండ్స్‌ని చూడగానే పై ప్రాణాలు పైనే పోతాయి. వీళ్ళల్లో ఎవరైనా తన 'కలర్'ని ఎగరేసుకుపోతారేమోనని పోనీ వేరేవాళ్ళని ఎవరినైనా చూసినా, పందిట్లో గొడవైతే ఆ అమ్మాయి కంప్లైంట్ చేస్తే తండ్రి తన చమ్డాలు ఒలిచేస్తాడు. ఆ కంగారులో వాళ్ళ గెడ్డాలు కాబోయే బావ గెడ్డం కన్నా ముందే పట్టేసుకుని 'బాబ్బాబూ ఒద్దురా ఏవీ అల్లరి చెయ్యొద్దు'' అని బతిమాలతాడు.

ఓరోజంతా చూపులు కలిపి, కాఫీలు అందించాక, ఆ అమ్మాయి సన్నగా నవ్వుతుంది ''మీ పేరు విద్యుల్లతా?'' అంటాడు.

''కాదు. ఏం?'' కోకిల స్వరం విప్పుతుంది.

''మెరుపు తీగలా వుంటేనూ?'' అంటాడు.

సన్నగా నవ్వి ''గోవిందమ్మ'' అని వెళ్ళిపోతే, తాగుతున్న కాఫీలో ఈగ పడినట్లయి వులిక్కిపడ్తాడు.

ఫలహారాలు చేస్తున్నప్పుడు ఉప్మా, పెసరట్టులో అల్లం చట్నీ వడ్డిస్తూ "నిజం చెప్పు. నీ పేరు గోవిందమ్మ కాదు కదూ?" అంటాడు.

"మా అమ్మమ్మ పేరు. ఏం గోవిందమ్మకి ఏమయిందీ?" ఆమె ఫ్రెండ్స్ అంతా నవ్వుతారు.

ఎదుర్కోలులో అమ్మాయీ అబ్బాయీ చెరో అడుగువేసి, ముందుకి వెళ్తుంటే, ఆమె పక్కకెళ్ళి "గోవిందమ్మ కాదుకదూ?" అంటాడు.

పెళ్ళి జరుగుతున్నా అతని కళ్ళన్నీ గోవిందమ్మ మీదే

ఈలోగా ఫ్రెండ్స్ అక్షింతలు అందుకుని, పెళ్ళికూతురి మీద కాకుండా ఆమె ఫ్రెండ్స్ మీద వెయ్యడంతో మార్కండేయ మావయ్య "ఒరేయ్ నీ కోతి గ్యాంగ్ చూడు ఆడపిల్లల్ని అల్లరి పెడ్తున్నారు. అందులో మా కళ్యాణి కూడా వుంది. దాని జోలికి వస్తే వాళ్ళ డొక్క చీరేస్తా" అని అరుస్తాడు.

ఎలాగో అలా ధైర్యం చేసుకుని, పట్టుచీరల్లో సీతాకోక చిలుకల్లా మెరిసిపోతున్న అమ్మాయిల దగ్గరకెళ్ళి "ఆ పసుపు ఓణీ అమ్మాయి పేరేంటండీ?" అంటే,

"అదా! ఆ జూకాలు పెట్టుకున్నదా?"

"జూకాలంటే తెలీదండీ"

"పోనీ చెంపసరాలూ?"

"అబ్బే అవేంటో తెలీవండీ"

"నవ్వుతుంటే బుగ్గ సొట్ట పడ్తోంది. అదేనా?"

"ఆ.. అవునండీ"

"దాని పేరూ.."

వెంటనే గట్టిమేళం. ఆ హోరులో ఆ అమ్మాయి పేరు చెప్పేసి, అక్కడి నుండి వెళ్ళిపోవడం.

పెళ్ళయిపోయింది. కానుకలు ఇచ్చేసాకా, ఆ అమ్మాయి వెళ్ళిపోతుందేమోనని కంగారుగా వుంటే రాజేశ్వరక్క ఏడుస్తూ "చంటాడు రూపాయి బిళ్ళ మింగేసాడురా అర్జెంటుగా డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళాలి" అంటుంది.

"నీ పిల్లాడు ఎలా పోతేనేం? నా ప్రేమ ముఖ్యం" అనలేడు. వెళ్ళి స్కూటర్ స్టార్ట్ చేస్తాడు.

డాక్టర్ దగ్గరకెళ్ళి చంటిగాడికి విరోచనం మందు వేయించి, పందిరంతా అమ్మాయి కోసం కళ్ళతో గాలిస్తుంటే తండ్రి పిలుస్తాడు.

"చూడు. సన్నాయి వాళ్ళకీ వంట వాళ్ళకీ, షామియానా, కుర్చీల వాళ్ళకీ లెక్క చూడు"

తల్లి పిలుస్తుంది.

"పెళ్ళికొడుకు ఫ్రెండ్ ఎవరికో ఫ్లైట్ టికెట్ బుక్ చెయ్యాలట వెళ్ళి మాట్లాడు" అని తరిమేస్తుంటే, ఆ అమ్మాయి కనిపిస్తుంది. వెళ్ళి ఎయిర్ బ్యాగ్ ఆమె చేతిలోంచి అందుకుని "వెళ్ళిపోతున్నారా గోవిందమ్మగారూ" అంటాడు.

దిగులుగా వున్న అమ్మాయి కిసుక్కున నవ్వుతుంది.

"మల్లీశ్వరీ రావే" మిగతా ఫ్రెండ్స్ పిలుస్తూ వస్తారు.

అతని మొహం వెలిగిపోతుంది.

"రేయ్. నా కళ్ళజోడు కనిపించడం లేదు. ఈ టాబ్లెట్ పేరు చూసి పెట్టు" తాతయ్య నస.

"ఒరేయ్ సుబ్రమణ్యం నా కాశీ చెంబు నీ చేతికిచ్చాగా. ఎక్కడ పెట్టావ్?" బామ్మ సాధింపు.

"ఒరేయ్ బడుద్దాయి అక్కడేం చేస్తున్నావ్? ఈ సన్నాయి వాళ్ళింకా నిలబడే వున్నారు. ఇట్రా" తండ్రి అరుపు.

"బాబూ. ఈ సారె మగపెళ్ళివారి గదిలో పెట్టిరా టైం అవుతోంది." అమ్మ అర్థింపు.

అతను మల్లీశ్వరి అడ్రెస్ తీసుకోలేదు. ఫోన్ నెంబర్ అడగలేదు. ఆమె టాక్సీ ఎక్కేసింది.

"దిగులు పడకురా సహోదరా" అంటూ ఫ్రెండ్స్ చుట్టుముట్టారు. "ఒరేయ్ ఆ అమ్మాయి పేరు మల్లీశ్వరి. వీడియోలో వుంది. ఇట్టే పట్టేస్తాం" అని భరోసా ఇస్తారు.

"ఏమిట్రా ఇంకా ఇక్కడా? ఆ షామియానా టేబుల్సూ, కుర్చీలూ" అంటున్న తండ్రితో అబ్బాయి

"నాన్నా నేను ఓ బంట్రోతులా అందరికీ అన్నీ అందించా. వంటవాడిలా, గుండిగలు మోసా. పాలేరులా పెళ్ళివారికి కాపలా కాసా. నైట్ వాచ్‌మెన్‌లా పోయిన వస్తువులకి బాధ్యత పడ్డా. డ్రైవర్‌లా అందర్నీ స్టేషన్ నుండి తోలుకొచ్చా. ఎకౌంటెంట్‌లా లెక్కలు చూసా. స్కావెంజర్‌లా పిల్లల ఔట్లూ, రెండ్లూ కడుగా. ఇకనైనా కళ్ళు తెరుచుకో నాన్నా. నాకన్నా రెండేళ్ళు వెనక పుట్టింది. పెళ్ళాడి వెళ్ళిపోతోంది. నాకూ వయసొచ్చింది. నేనూ పెళ్ళికి రెడీ అయ్యాను అని ఆక్రోశం వెలిబుచ్చాలనుకున్నాడు.

ఈలోగా చెల్లెలు "అన్నయ్యా" అంటూ వచ్చి వాటేసుకుంది.


"మిమ్మల్ని అందర్నీ, పుట్టి పెరిగిన ఈ ఇల్లు వదిలి వెళ్ళలేనురా. నీలాంటి అన్న ఎవరికీ వుండడురా. ఇక్కడ పుట్టడం నా అదృష్టం రా!" అంటూ ఏడ్చింది.


"అమ్మా బంగారు తల్లీ" అంటూ తల్లి ఏడుపు. వెంటనే పెద్దమ్మలూ, పిన్నమ్మలూ, అత్తలూ వరసకి అక్కలూ, బాబాయ్‌లూ, మావయ్యలూ, బామ్మలూ, అమ్మమ్మలూ అంతా కోరస్‌గా ఏడ్చారు. ఇంతమంది ఏడుస్తుంటే పనిమనిషి ఎక్కిళ్ళు పెట్టి ఏడ్చింది. సన్నాయి వాడు ఏడుస్తూ "బంగారు బొమ్మ రావేమే. .. పందిట్లో పెళ్ళి జరిగేనే" అని వాయించి నాలిక కొరుక్కుని "పందిట్లో పెళ్ళవుతున్నాదీ" అని ఏడుపు పాట మొదలెట్టాడు.

అందరి ఏడుపులూ చూసి, బావమరిది భోరుమని ఏడుస్తూ, చెల్లెలు వీపు నిమిరి "నాన్నగారి ప్రావిడెంట్ ఫండ్ నా అమెరికా చదువుకి పెట్టిన డబ్బూ అమ్మ వడ్డాణం అమ్మిన డబ్బూ, తాతగారి నలభై సెంట్ల భూమీ అన్నీ అమ్మి రాత్రనకా, పగలనకా అరవ చాకిరీ చేసి, ఒళ్ళు హూనం, కొంప గుండం అయి, అమెరికాలో డాలరు గుడ్లు పొదిగే మొగుడి చేతిలో పెట్టి పెళ్ళి చేసి పొమ్మంటే పోనంటావేంటే? నువ్వు వెళ్ళక పోతే ఇదంతా వృధానే కదే?" అన్నాడట పళ్ళు కొరికి.

ఇదేదో నేను తమాషాకి రాసినా, ఆడపిల్ల జీవితంలో అన్నా తమ్ముడిది చాలా ముఖ్య పాత్ర. అతనే ఆమె పెళ్ళికి 'పెద్ద' వరసకి చిన్న అయినా సరే పెళ్ళికి పెద్దే. అందుకే బావగారిని కాశీయాత్రనుండి వెనక్కి తెచ్చి "మా చెల్లెల్ని పెళ్ళి చేసుకుని బ్రహ్మచర్యం వదిలిపెట్టండి బావగారూ" అని గెడ్డం కింద బెల్లంముక్క పెట్టి బతిమాల్తాడు. సుఖంలో కష్టంలో బావగారికి 'సారే దునియా ఏక్ తరఫ్' సాలే మియా ఏక్ తరఫ్" అనిపిస్తాడు.

COMMENTS


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి


కాలమ్ దాటని కబుర్లు-II
బలభద్రపాత్రుని రమణి